క్లుప్తంగా

విద్యుదాఘాతంతో గేదె మృతి

నడికూడ : విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తాళ్ల అశోక్‌కు చెందిన గేదె రోజుమాదిరిగానే మహ్మద్ షా వాగు వైపు మేతకు వెళ్లింది. పచ్చిక మేస్తున్న క్రమంలో తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కి తగలడంతో అక్కడికక్కడే గేదె మృతిచెందింది. దీంతో రైతుకు రూ.50 వేల నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

ఎమ్మార్పీఎస్ గ్రామకమిటీ ఎన్నిక



వేలేరు : ఎమ్మార్పీస్ గ్రామకమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు మనోజ్ కుమార్ తెలిపారు. గ్రామశాఖ అధ్యక్షుడిగా కనకం సాంబరాజు, ఉపాధ్యక్షులుగా మోకినపల్లి మహేశ్, ప్రధాన కార్యదర్శిగా గొర్రె నవీన్, కార్యదర్శులుగా పూర్ణచందర్, శ్రీనివాస్, ఐలయ్య, ప్రచార కార్యదర్శులుగా వెంకన్న, సురేశ్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు శాంతిసాగర్, రాజయ్య, సోమన్న, సురేందర్, సోమశేఖర్, యేసు, రాకేశ్ పాల్గొన్నారు.

డప్పు కళాకారుడి మృతికి నివాళి

పరకాల : మండలంలోని వెల్లంపల్లి గ్రామానికి చెందిన మాదిగ డప్పు కళాకారుల సంఘం అధ్యక్షుడు పెండెల రంజిత్ మాదిగ అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందాడు. ఆయన మృతదేహానికి శుక్రవారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి శంకర్‌మాదిగ, జిల్లా అధ్యక్షుడు కోగిలరవి, జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణు, గ్రామ కమిటీ అధ్యక్షుడు మహేందర్ నివాళులర్పించారు.

ప్రపంచ శాంతికి పాటుపడాలి



ఆత్మకూరు : ప్రపంచ శాంతికి ప్రతిఒక్కరూ పాటుపడాలని అఖిల భారత హనుమాన్ ప్రచారకుడు, ఉత్తమ పూజారి అవార్డు గ్రహీత గాదె పాక రాములు స్వామి పిలుపునిచ్చారు. ప్రపంచ శాంతి, భారతదేశంలో ఉగ్రవాద నిర్మూలన నినాదంతో రాష్ట్రంలోని 108 శైవ, 108 వైష్ణవ దేవాలయాలను దర్శించుకుంటున్నారు. ఈ క్రమంలో గురువారం మండల కేంద్రంలోని పంచకూట శివాలయం, వేణుగోపాలస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. ప్రపంచంలోనే హిందూ ధర్మం గొప్పదని అన్నారు. భారతదేశంలో ఉగ్రవాదం లేకుండా కేంద్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందన్నారు.

మూడో విడత దోస్త్ అడ్మిషన్ల ప్రారంభం

పరకాల : తెలంగాణ ఉన్నత విద్యా మండలి ద్వారా డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు కల్పించే దోస్త్ (డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్) మూడో విడత అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బేతి సంతోశ్‌కుమార్ శుక్రవానం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా రెండో విడతలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసుకోవాలని కోరారు. ఈనెల 19వ తేదీలోపు అడ్మిషన్లు పూర్తి అయ్యి 30వ తేదీ నుంచి మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. కళాశాల సహాయ కేంద్రంలో లేదా దోస్త్ కోఆర్డినేటర్, వైస్ ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని కోరారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

వేలేరు : మండల కేంద్రంలోని సబ్ స్టేషన్‌లో, ధర్మసాగర్ మండలంలోని నారాయణగిరి సబ్ స్టేషన్‌లలో శనివారం అత్యవసర మరమ్మతుల కారణంగా సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ఆయా గ్రామాలకు, అన్ని ఫీడర్‌లలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ కుమారస్వామి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఫోన్ నంబర్లు మార్పు

నారాయణగిరి సెక్షన్ విద్యుత్ శాఖ అధికారుల ఫోన్ నంబర్లు మారినట్లు విద్యుత్ శాఖ ఏఈ కుమారస్వామి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నారాయణగిరి ఏఈ 8712484540, నారాయణగిరి సబ్ ఇంజనీర్ 8712484536, నారాయణగిరి లైన్ ఇన్స్‌పెక్టర్ 8712484534, వేలేరు లైన్ ఇన్స్‌ఫెక్టర్ 8712484537, నారాయణగిరి సబ్ స్టేషన్ 8712484535, వేలేరు సబ్ స్టేషన్ 8712484538, మల్లికుదుర్ల సబ్ స్టేషన్ 8712484532, పీచర సబ్ స్టేషన్ 8712484533 ఈ నంబర్లపై అందుబాటులో ఉంటారని తెలిపారు.

నిద్రిస్తున్న నిఘా నేత్రం..

- గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు
- కనెక్షన్ ఇవ్వడం మరిచిన అధికారులు
- నాలుగేళ్లుగా నిరుపయోగంగానే..



మరమ్మతుకు చేరుకున్న పాత గ్రామపంచాయతీ కూడలి వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

నడికూడ : 'ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానం.. సీసీ కెమెరాల ఏర్పాటుకు చిరు వ్యాపారులతో పాటు గ్రామస్తులు సైతం సహకరించాలి.' అని పోలీస్ అధికారులు ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించి చెప్పే మాటాలు.. కానీ సీసీ కెమెరాలు ఉన్నచోట నిర్వహణ లోపంతో మూలకు పడుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ వాటిని పట్టించుకోకపోవడంతో మరమ్మతు దశకు చేరుకున్నాయి. పరకాల పోలీసుల సూచనతో సమాజ శ్రేయస్సు కోసం మండల కేంద్రానికి చెందిన ఎన్ఆర్ఐ సహకారంతో సుమారు రూ.4 లక్షల విలువ చేసే 30 సీసీ కెమెరాలను మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఏర్పాటు చేశారు. కానీ వాటికి కనెక్షన్ ఇవ్వకుండా గాలికొదిలేయడంతో నాలుగేళ్లుగా అలంకారప్రాయంగానే మారాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో కొన్ని సీసీ కెమెరాలను గుర్తుతెలియని వ్యక్తులు కొన్నిరోజుల క్రితం అపహరించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలకు వెంటనే మరమ్మతు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. గ్రామాల్లో నేరాల నియంత్రణ, దొంగతనాలకు అడ్డుకట్ట వేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. సీసీ కెమెరాలకు కనెక్షన్ ఇచ్చి నిర్వహణ బాధ్యతలను ఏదైనా శాఖకు చెందిన అధికారులకు అప్పగించాలని ఈ సందర్భంగా స్థానికులు కోరుతున్నారు.



వాటర్ ట్యాంక్ వద్ద..



నూతన గ్రామపంచాయతీ వద్ద..

వినియోగంలోకి తేవాలి



మా గ్రామానికి చెందిన వ్యక్తి 30 సీసీ కెమెరాలను స్వంతంగా కొనుగోలు చేసి అందించారు. కానీ అధికారులు ఇప్పటి వరకు కనెక్షన్ ఇవ్వకపోవడంతో అవి అలంకారప్రాయంగా మిగిలిపోతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే వినియోగంలోకి తీసుకురావాలి.

-నారగని రాకేశ్, నడికూడ

అధికారులు స్పందించాలి



గ్రామాల్లో శాంతిభద్రతలు, నేరాల నియంత్రణకు పరకాల పోలీసుల పిలుపుతో స్వంతూరి కోసం మా గ్రామాన్ని చెందిన ఎన్ఆర్ఐ 30 సీసీ కెమెరాలను అందించారు. కానీ అధికారుల సహకారం లేకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి.

- ఊర రవీందర్‌రావు, మాజీ సర్పంచ్ నడికూడ

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం తగదు

మున్సిపల్ శాఖ నోడల్ అధికారి అన్నపూర్ణ



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ శాఖ నోడల్ అధికారి చామర్తి అన్నపూర్ణ

పరకాల : వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నందున పారిశుద్ధ్య పనులపై నిర్లక్ష్యం వహించకుండా మున్సిపల్ సిబ్బంది పనిచేయాలని మున్సిపల్ శాఖ నోడల్ అధికారి చామర్తి అన్నపూర్ణ ఆదేశించారు. పురపాలక 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా శుక్రవారం పరకాల మున్సిపాలిటీ కార్యాలయానికి చేరుకున్న నోడల్ అధికారి అన్నపూర్ణ స్వయం సహాయక సభ్యులతో, మెప్మా సిబ్బందితో సమావేశమయ్యారు. అనంతరం పరకాల మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆమె పరిశీలించారు. పారిశుద్ధ్య పనులపై ఏలాంటి ఫిర్యాదు రాకుండా చూసుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. అధికారులు సైతం పనులను పర్యవేక్షించాలన్నారు. మున్సిపల్ క మిషన్ వెంకటేశ్, సానిటేషన్ అధికారి ప్రశాంత్, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



షేక్ ఖాసీం

కమలాపూర్ : మండల కేంద్రం పరిధిలోని ఖాసీంపల్లిలో ముస్లిం మైనార్టీ గ్రామ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షేక్ ఖాసీం, ఉపాధ్యక్షుడిగా సయ్యద్ హోలీ, కార్యదర్శిగా షేక్ వలీ, ప్రచార కార్యదర్శిగా షేక్ హోలీ, కోశాధికారిగా అఫ్సర్‌ను ఎన్నుకున్నారు. అనంతరం కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మైనారిటీల హక్కుల సాధనకు కృషి చేస్తామన్నారు. అందరూ కలిసికట్టుగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా పలువురు వారిని అభినందించారు.

చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం



ఎల్కతుర్తి : అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంఈఓ



శాయంపేటలో..



ధర్మసాగర్ : అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంఈఓ

ఎల్కతుర్తి : మండలంలోని దామెర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలోని చిన్నారులకు శుక్రవారం మండల విద్యాధికారి చదువుల సత్యనారాయణ అక్షరాభ్యాసం చేయించారు. ముందుగా పాఠశాలలో నూతనంగా ఒకటో తరగతిలో అడ్మిషన్లు పొందిన పిల్లల తల్లిదండ్రులకు, చిన్నారులకు పాఠశాల బృందం పుష్పగుచ్ఛాలిచ్చి స్వాగతం పలికింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణారెడ్డి, ప్రధానోపాధ్యాయులు అలివేణి, తిరుపతి, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్లు, సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కమలాపూర్ : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో నూతనంగా ప్రవేశాలు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు అక్షరాభ్యాసం చేయించారు. పలువురు దాతలు చిన్నారి విద్యార్థులకు పలకలు అందజేశారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలోని గొల్లవాడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఎంఈఓ విజయకుమార్ సామూహిక అక్షరాభ్యాసాన్ని శుక్రవారం చేయించారు. ఈనెల19వ తేదీ వరకు బడిబాట కార్యక్రమం కొనసాగుతుందని, బడీడు పిల్లలందరిని బడిలో చేర్పించాలన్నారు. బడిలో చేరిన విద్యార్థులు డ్రాప్ అవుట్ కాకుండా చూసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు సబ్జెక్టు వారీగా సామర్థ్యాల్లో ముందుండేలా బోధన చేయాలన్నారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు నిర్మలకుమారి, పీఎస్ హెచ్‌ఎం రాజు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి, ఉపాధ్యాయులు పుష్పలత, నర్సింహస్వామి, కిరణ్‌కుమార్, వసంత, కవిత, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వేలేరు : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన విద్య, సౌకర్యాలు కల్పిస్తుందని తహసీల్దార్ హెచ్.కోమి తెలిపారు. బడిబాటలో భాగంగా స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆమె అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌళిక వసతులు, పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం, తదితర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులతో అక్షరాలు దిద్దించారు. కార్యక్రమంలో ఎంఈఓ చంద్రమౌళి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని హనుమకొండ జిల్లా సీఎంఓ సుందర్శన్‌రెడ్డి అన్నారు. ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని తల్లిదండ్రులు గమనించాలని సూచించారు. ఎంఈఓ భిక్షపతి, ప్రధానోపాధ్యాయులు మాధవి, శ్రీనివాస్, రాజాయుగేందర్, అశోక్‌రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ లావణ్యతో పాటు ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మసాగర్ : బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని ఎంఈఓ రాంధన్ కోరారు. మండలంలోని క్యాతంపల్లి గ్రామంలో గల ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బండ రమేశ్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా మండల విద్యాధికారి డాక్టర్ రాంధన్ పాల్గొని నూతనంగా పాఠశాలలో చేరిన విద్యార్థులకు అక్షరాభ్యాసం చేపించారు. ఈ కార్యక్రమంలో ఏపీపీసీ చైర్మన్ స్వప్న, మాజీ ఉపసర్పంచ్ రాజు, గ్రామస్తురాలు ఉమాదేవి, పాఠశాల ఉపాధ్యాయులు చిన్నారెడ్డి, కేశవరెడ్డి, కిషన్, సంపత్రెడ్డి, మాధవి, అంగన్వాడీ టీచర్ మమత తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమమే టీడబ్ల్యూజేఎఫ్ లక్ష్యం



మహాసభలో మాట్లాడుతున్న సోమయ్య

నయీంనగర్: జర్నలిస్టుల సంక్షేమమే తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) లక్ష్యమని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య అన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం అనేక పోరాటాలు నిర్వహించి, ఎన్నో విజయాలను సాధించినట్లు తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో టీడబ్ల్యూజేఎఫ్ తృతీయ జిల్లా మహాసభ.. టివి.రాజు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జర్నలిస్టులకు గత ప్రభుత్వం చేసిందేమీ లేదని, అనేక సౌకర్యాలు కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన ప్రస్తుత ప్రభుత్వం కూడా జర్నలిస్టులకు మొండిచేయి చూపిందని ఎద్దేవాచేశారు. జర్నలిస్టుల సంక్షేమానికి ఐక్యమత్యంగా ఉండి పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఎల్లప్పుడు జర్నలిస్టులకు అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి ఆనందం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొక్క దయాసాగర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి విజయ్ కుమార్, వల్లాల జగన్, ఇ.చంద్రశేఖర్, బాబురావు, అంతడుపుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టీడబ్ల్యూజేఎఫ్ నూతన కార్యవర్గం

టీడబ్ల్యూజేఎఫ్ హనుమకొండ జిల్లా కార్యవర్గాన్ని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా టీవీ రాజు, ప్రధాన కార్యదర్శిగా అంతడుపుల శ్రీనివాస్, కోశాధికారి ఈసంపెల్లి రమేష్, ఉపాధ్యక్షుడిగా దామెర రాజేందర్, సంయుక్త కార్యదర్శి మండ రాజేష్, ఈర్ల తిలక్‌ను మహాసభ ఎన్నుకుంది. కార్యవర్గ సభ్యులుగా కొండ్రు దయాకర్, ఎల్లంకి జగపతిరావు, మరుపట్ల శంకర్, కె.ప్రవీణ్, డి.రవీందర్, రవికుమార్, ఎంఎస్ రావు, సయ్యద్ అలీ, బొల్లపల్లి రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

తహసీల్దార్‌కు సన్మానం

నర్సంపేట : చెన్నారావుపేట తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా దిలావర్ మహ్మద్ అబిద్ అలీని బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ బోడ మురళి నాయక్, సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి రాము శుక్రవారం సన్మానించారు. తొలుత ఆయనకు పూల బొకే అందజేసి అభినందనలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవాభావంతో విధులు నిర్వర్తించాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్ పంపిణీ

దుగ్గొండి : మండలంలోని బిక్కాజిపల్లికి చెందిన గుండెకారి మలహల్‌రావుకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మేర్గు కట్టమల్లు, మండల నాయకుడు బండారి రమేశ్ శుక్రవారం పంపిణీ చేశారు. అనంతరం కట్టమల్లు, రమేశ్ మాట్లాడారు. పేదలు సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు నల్ల రవి, బండారి ప్రకాశ్, ఇజ్జగిరి ముత్తయ్య, మాడిశెట్టి మహేశ్, నల్ల రాధాకిషన్, తదితరులు పాల్గొన్నారు.

పంటమార్పిడితో అధిక దిగుబడి

- శాస్త్రవేత్త దిలీప్ కుమార్



మాట్లాడుతున్న శాస్త్రవేత్త దిలీప్ కుమార్

ధర్మసాగర్ : రైతులు పంటమార్పిడి విధానం పాటిస్తే అధిక దిగుబడి పొందవచ్చని శాస్త్రవేత్త డాక్టర్ దిలీప్ కుమార్ సూచించారు. మండలంలోని దేవునూర్ గ్రామంలో శుక్రవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు యూరియా వినియోగాన్ని తగ్గించాలని, రసాయనిక మందులను అవసరం ఉన్నంత వరకే వాడాలన్నారు. నీటిని జాగ్రత్తగా వాడాలని అన్నారు. అనంతరం డాక్టర్ విశ్వతేజ మాట్లాడుతూ.. వ్యవసాయానికి అవసరమైన విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు కొనుగోలు చేసినప్పుడు తప్పకుండా రసీదు తీసుకొని భద్రపరచుకోవాలని అన్నారు. అదే విధంగా నాణ్యమైన విత్తనాలను, అధిక దిగుబడినిచ్చే నూతన రకాలను పండించాలని, చెట్లను రక్షించి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఏఓ రాజేశ్ మాట్లాడుతూ.. రైతులు జాతీయ రైతు గుర్తింపు కార్డులు పొందేందుకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ నవ్య, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలోనే నాణ్యమైన విద్య



ఆటోలకు పోస్టర్ అంటించి ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

శాయంపేట : ప్రభుత్వ కళాశాలలోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కందగట్ల కోటేశ్ అన్నారు. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు చేరాలని అధ్యాపకులు శుక్రవారం మండల కేంద్రంలోని ఆటోలకు పోస్టర్లు అంటించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఒకేషనల్ కోర్సులు ఉన్నాయని తెలిపారు. ప్రైవేట్ కళాశాలలకు దీటుగా మౌలిక వసతులు, ఇతర సదుపాయాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. మండలంలో పదోతరగతి పూర్తిచేసిన విద్యార్థులు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని కోరారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



కమలాపూర్ : అధికారులతో కలిసి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏఎంసీ చైర్ పర్సన్ ఝాన్సీరాణి



శాయంపేట : రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ

కమలాపూర్ : భూ సమస్యలు పరిష్కరించేందుకే భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఏఎంసీ చైర్‌పర్సన్ ఝాన్సీరాణి అన్నారు. మండలంలోని వంగపల్లిలో శుక్రవారం నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణితో రైతులు నరకాన్ని అనుభవించారని, ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతితో రైతుల సమస్యలు సునాయాసంగా పరిష్కారం అవుతాయన్నారు. అనంతరం అధికారులతో కలిసి భూ సమస్యలకు సంబంధించి ప్రజల నుంచి 356 దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ దేశిని ఐలయ్య, డైరెక్టర్ ఓర్సు తిరుపతి, తహసీల్దార్ సురేశ్‌కుమార్, నాయబ్ తహసీల్దార్ శోభారాణి, గిర్దావర్ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు పోడేటి భిక్షపతి, కొండ తిరుపతి, గూడెపు మొగిలయ్య, ఆకునూరి సాంబయ్య, చిలువేరు రవీందర్, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సు

శాయంపేట : మండలంలోని కొత్తగట్టు సింగారంలో గల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం తహసీల్దార్ కల్వల సత్యనారాయణ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగట్టు సింగారంలో భూ సమస్యలపై రైతుల నుంచి 80 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 8 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించామని, 1,710 దరఖాస్తులు స్వీకరించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్ఐ రమేశ్‌ఖన్నా, ఏఎస్ఓ ప్రవీణ్, ఆపరేటర్ నాగరాజ్, రెవెన్యూ సిబ్బంది విజయ్, శ్రీను, రాజు, శశికాంత్, గ్రామ పంచాయతీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పరకాల : మండలంలోని కామారెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన భూ భారతి రెవెన్యూ సదస్సులో 48 అర్జీలు స్వీకరించినట్లు తహసీల్దార్ విజయలక్ష్మి తదితరులు తెలిపారు.

గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం

- దుర్గంధంతో ప్రజల ఇబ్బందులు
- చనిపోయిన పంది.. కుళ్లిపోయి దుర్వాసన
- తొంగిచూడని పంచాయతీ సిబ్బంది



కాల్వలో పేరుకుపోయిన మురుగు నీరు

ధర్మసాగర్ : ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం కోసం మండలానికి ఒక ప్రత్యేక అధికారితో పాటు ప్రతి గ్రామపంచాయతీకి ప్రత్యేక అధికారులను నియమించింది. ప్రత్యేక అధికారులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. 4 రోజుల క్రితం కురిసిన వర్షానికి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో జెండా సర్కిల్‌దగ్గర మురికి కాల్వల్లో నీరంతా నిలిచిపోగా పంచాయతీ అధికారులు తొంగిచూడడం లేదనే విమర్శలు వస్తున్నాయి. వరద నీటిలో పడి ఓ పంది చనిపోయి కుళ్లిపోగా దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు ఆగ్రహిస్తున్నారు. పంచాయతీ కార్యాలయంలో కొందరు వ్యక్తులకు ఎలాంటి పనులు చెప్పకుండా కొందరితో మాత్రమే ప్రతీ పని చేపిస్తున్నారని పారిశుద్ధ్యకార్మికులు చర్చించుకుంటున్నారు. అయితే కాలవ్లో చనిపోయిన పందిని తీసేందుకు ఎవరూ రాకపోవడం అదే వీధిలో ఉంటున్న నలుగురు పారిశుద్ధ్య కార్మికులు పట్టించుకోకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు వెంటనే పట్టించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

లాభసాటి వ్యవసాయానికి ఉద్యమించాలి

- రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ శ్రీనివాస్

దుగ్గొండి : రైతులు లాభసాటి వ్యవసాయం కోసం పాలకులపై ఉద్యమించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ కోరారు. వ్యవసాయం, రైతుల హక్కులపై రూపొందించిన షార్ట్ ఫిలింను మండలంలోని పానకల్‌లో శుక్రవారం సాయంత్రం ప్రదర్శించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయని తెలిపారు. రైతులకు ప్రోత్సహకాలు అందించడానికి భిన్నంగా భారాలు మోపడానికి ప్రాధాన్యత ఇస్తున్నాయని చెప్పారు. జీలుగ విత్తనాల బస్తాను ఏడాదిలో రెట్టింపు చేయడాన్ని ఉదహరించారు. పాలకుల మోసపూరిత విధానాలతో వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయిందని ఆందోళన వెలిబుచ్చారు. ఫలితంగా వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు మూతపడి అనేక మంది నిరాశ్రయులుగా మారుతున్న దుస్థితి నెలకొందని చెప్పారు. లాభసాటి వ్యవసాయ పద్ధతులు ప్రవేశపెట్టేలా, రైతులను సబ్సిడీలతో ప్రోత్సహించేలా ఐక్యపోరాటాలు నిర్మించాలని సూచించారు. ఆ దిశగా రైతులను, ప్రజలను చైతన్యవంతం చేయాలని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య, మండల అధ్యక్షుడు లడె మోహన్‌రావు, నాయకులు గుండెకారి రాజేశ్వర్‌రావు, మోర్తాల రవీందర్, బుస్సారి బాబురావు, శిరూరి రాజేశ్వర్‌రావు, కిటొకె సంజీవరావు, వాడికారి బాపురావుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

గీసుకొండ : మండలంలోని మనుగొండకు చెందిన మూగల సమ్మయ్య, చాపర్తి శ్రావన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, ప్రముఖ సామాజిక సేవకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి శుక్రవారం రూ.10 వేల చొప్పున సాయం అందజేశారు.